కథానిక:

అబద్ధాలు

"శిపం"

వెంకట్రావు ఆనాడు ఏమీ తోచక బెజవాడ బయలుదేరేడు. ఎప్పుడొచ్చినా బెజవాడలో అంత మంది స్నేహితులు కనపడేవారు, ఆనాడు ఒక్కడూ కనబడడం లేదేమా అని ఆలోచిస్తూ మందముగా అడుగులు వేస్తున్నాడు. ఎక్కడికి వెళ్లటం తెలదే! భోజనం కాస్తా హోటల్లోనే కానిచ్చేసి, మబ్బుగా వుండి, చల్లగా వుండటం మూలన రోడ్లన్నీ తిరుగేస్తున్నాడు వెంకట్రావు. కాస్సేపటికి అలసిపోయి యిన్ని టీ నీళ్లు త్రాగి పార్కులో ఆసీనుడయ్యేడు స్నేహితుల్ని తిట్టుకుంటూ! స్నేహితం యింతే కదా! తానొకప్పుడు భుజంగరావుకి ప్రాణం యిచ్చేసేవాడు. యిప్పుడో? కొంతకాలం శివరాం అంటే అన్నం అక్కరలే...ఇప్పుడో? మరి కొంతకాలం రాజా తనకుడిభుజం అనుకున్నాడు—ఇప్పుడు తనేమైనా అతని కక్కరలే.. కాలం! పిల్లా యింతే కదా?

ఆలోచనలు టక్కున ఆగిపోయేయి. తనని ఎవరో దీక్షగా మాస్తున్నట్లు అనుమానం కలిగి నలుమూలలా పరికించేడు. ప్రక్కనే వున్న గులాబీమొక్క మాటునుంచీ...ఏభై వుంటుంది వయస్సు—వో ముసలాయన తనని పరిశీలనగా చూస్తున్నాడు. తను ఆయనని చూడంగానే. ఆయన ముందుకి వస్తూ "మిమ్మల్ని ఎక్కడో చూసిన జ్ఞాపకం...ఎక్కడా అని!" అన్నాడు. వెంకట్రావుకి వళ్లు మండింది. ఎవరో అపరిచితుడు తనవట్లా చూడటం. . పైగా పూనుకొని పెద్ద రాచకార్యం పడిపోయినట్లు వచ్చి ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం అనటం! ఏం.. ఎంతమందిని చూడటంలే—రోజూ రోడ్డుమీద. కాని యింతలో యిదివరకు తను బెజవాడలో నాలుగేళ్లున్నాడని జ్ఞాపకానికి వచ్చి ఆయన తనని ఎరిగివుండటం అసంభవం కాదని గ్రహించి కోపం దిగమింగేడు. ఆయన తన పక్కనే వున్న ఖాళీస్థలం ఆక్రమించుకుంటూ 'యిప్పుడేం చదువుతున్నారు మీరు?' అన్నాడు.

'కాకినాడలో బి. ఏ. మొదటి తరగతి చదువుతున్నానండీ!'

'ఓహో! అట్లా చెప్పండి. శర్మ తెలుసు ననుకుంటా మీకు—అతని పరీక్ష ఏమైందండీ' అన్నాడు ముసలాయన.

'శర్మా? ఎవరబ్బా, అతను - ఎర్రగా వుంటాడు కదండి,—కొంచెం పొడుగు—? టెన్నిస్ ఆడుతాడు కూడాను - అతన్ని అట్టే బాగా ఎరగను కానండీ, పాపం! అతని పరీక్ష మాత్రం పోయింది' అన్నాడు వెంకట్రావు— నిజానికి తను శర్మని ఎరక్కపోయినా! నాలు గబద్ధాలు చెప్పి, ఆయన తనతో అనవసరసంభాషణ చేస్తున్నందుకు, శర్మద్వారా నన్నా కసి తీర్చుకుందామని.

'పాపం పోయిందే! అతను మాపక్కింటి వారబ్బాయి లెండి. ఈ వూళ్లో మీ బంధువు లెవరన్నా వున్నారాండి? అన్నట్లు అడగమరచేను మీనామధేయం?

'బంధువు లెవరూ లేరండీ! నాపేరు సుబ్బరావు లెండి—ఇంటిపేరు కనిగిరి వారు' అన్నాడు వెంకట్రావు తడుముకోకుండా, ధైర్యంగా.

'ఆ! ఎవరన్నావ్—కనిగిరివారా? సత్యనారాయణ ఏమవుతాడు నీకు?' అన్నాడాయన ఆశ్చర్యం చూపుతూ.

'సత్యనారాయణగా రెవరండి నాకు. - మా నాన్నగారు విశ్వనాథంగారు' అన్నాడు వెంకట్రావు ఆలోచించకుండానే.

'ఆ! ఆ! విశ్వనాథంకొడుకు వటోయి నువ్వు! అందుకనే "ఎక్కడ చూసేనా" అనుకున్నా మొదట చూడగానే. మీనాన్నా, నేనూ ఆప్తబంధువుల్లా వుండేవాళ్లం. మేమింకా బతికుండగానే నువ్వు వేరే చోట భోజనం చెయ్యటం — మంచివాడవ్ — నడు' యింటికి పోదాం' అన్నాడాయన చనువుగా.

'అబ్బే! యీపూట హోటల్లోనే కానిచ్చి యింటికి పోతానండి' అన్నాడు వెంకట్రావు— కథయిట్లా అడ్డం తిరిగినందుకు ఆశ్చర్యపోతూ యికముం దెట్లా వస్తుందోనని ఆలోచిస్తూను!

'యింకా నయం; నన్ను నువు ఎరగవు కాని, నేను నిన్ను ఎరగనటోయి! మీనాన్నా నేను ఎంత చనువుగా వుండేవాళ్లం! అన్నట్లు యిప్పుడెక్కడుంటున్నారాయన?'

'ఆయన పోయి రెండేళ్లయిందండి! నెల్లూరులో సర్కిలు చేస్తూ పోయారు. తర్వాత నేను కాకినాడలో వుండి చదువుతున్నా' అన్నాడు వెంకట్రావు.

'హరి హరి! ఎట్లాంటి వార్త విన్నానోయి! పోయేడా మహానుభావుడు; ఆహా! పుణ్యమూర్తి కదోయి ఆయన! సుందరవిగ్రహం - ఆ గంభీరమైన ఆకారం! దొంగలకి హడల్ కదోయి ఆయనపేరు చెబితే! చిన్నతనంలోనే భగవంతుడు ఎన్నికష్టాలు తెచ్చిపెట్టేడో చూడు!' అని ఆయన దిగాలుపడి కూచున్నాడు.

వెంకట్రావుకి అపరిమితమైన ఆశ్చర్యమైంది. యీ వ్యవహారం ఏమీ బాగున్నట్లు లేదు తను మారు పేరు ఎందుకు చెప్పాలి? అది యీయన యెరుగున్న పేరై వుండాలా? పాపం! ఆ పేరుగలాయన యీయనికి ఎంత స్నేహితుడో! ఆయన ఒక వేళ బతికే వున్నట్లైతే తను ఎంత తప్పు పని చేసినట్లు అవుతుంది? ఆయన యిప్పుడు అగస్మాత్తుగ కనపడితే ఏమవుతుంది? యిట్లా ఆలోచిస్తున్నాడు వెంకట్రావు.

ముసలాయన కొంచెం సేపటికి తేరుకొని వూరుకో నాయనా! విచారిస్తే లాభంలేదు— ఇంతకే ఆయుర్దాయం నిండింది

పిడుగులాంటి మనిషిపోయేడంటే నేనే నమ్మలేకుండా వున్నా! ఇంకో క్షణానికి జరిగే సంగతి ఎవరు చెప్పగలరు? ఇంతకీ కాలం, కర్మం, అట్లావుంది - మంచి బ్రాహ్మడు పాపం!

ఏమిటీ వాళ్లు బ్రాహ్మలా! అల్లాగయితే యీయన బ్రాహ్మడేనా? యింకా నయం! తను వాళ్లింటికి భోజనానికి వెళ్లి వాళ్ల బ్రాహ్మణ్యం తగలెయ్యలేదు - యీ 'టాపిక్' మార్చేస్తే బాగుండును అనుకున్నాడు వెంకట్రావు.

ఇంతట్లో రోడ్డుమీదనుంచి ఒక పెళ్ళి వూరేగింపు వెళ్తోంది. వెంకట్రావు అన్నాడు రోడ్డువంక చూస్తూ, 'నాలుగు రోజుల్నుంచి పెళ్లిళ్లు బాగా జరిగిపోతున్నాయండీ!'

'అవును నాయనా, వచ్చేవి పుష్కరాలు గదూ! యిప్పుడు చెయ్యకపోతే మరి రెండేళ్ల వరకూ ఆడపిల్లలకు పెళ్లిళ్లు కావు. కన్న తర్వాత చెయ్యక తప్పుతుందా! బోలెడేసి కట్నాలు పోస్తేకాని పెళ్ళిళ్లు అవటంలేదు-' అన్నాడాయన కళ్లల్లో అదోవిధమైన కాంతి తళుక్కు మనగా.

'కట్నాలట! కట్నాలు! ఎందుకండే యీ వెధవకట్నాలు? - ప్రతీవెధవా కట్నాలు కావాలనడమేనా? అర్థం లేదండీ మన కట్నాల్లో' అన్నాడు వెంకట్రావు లెక్చరిచ్చే పోజులో.

ముసలాయన కొంచెం సర్దుకు కూర్చుని 'ఎవరో నూటికి ఒకళ్లుంటారు నాయనా మీలాంటివాళ్లు! అందరూ నీలాగే వుంటారా నాయనా? చల్లగా వెయ్యేళ్లు వర్ధిలు నాయనా' అంటూ బెంచీమీద జార్లబడ్డాడు.

'చూడండీ! మన నాగరికత అనుకొని ఏవేవో వెర్రిపనులు చేస్తాం - కాని, ఆలోచిస్తే అది రాతియుగంనాటి అనాగరికతక్రింద తేల్తోంది! అమెరికాళ్లో క్లబ్బుల్లో గుడ్డలిప్పుకు తిరుగుతారట - నాగరికత అంటూ?'

ఆయన వెంకట్రావు తెలివికి సంతోషం కనపరుస్తూ 'నడు, నాయనా? భోజనానికి వేళవుతోంది - ఎప్పుడు తిన్నావో?' అన్నాడు లేస్తూ.

వెంకట్రావుకి పిడుగుమీద పడ్డట్లే అయింది! ఈయన బ్రాహ్మలో, కాదో! తను ఆయన యింట్లో భోజనం ఎట్లాగూ చేసేది! అయినా ఆఖరు ప్రయత్నంగా 'కాదండీ! నేను రాత్రే కాకినాడపోవాలి! అయినా ఆకలి కావటం లేదండీ.. 'అన్నాడు.

'నయమే. మాయింట్లో సిగ్గుపడవలసిన విషయమేముంది? మరేం ఫర్వాలేదు! నడు, నాయనా! యీ ముసలాణ్ణి బాధపెట్టకు' అన్నాడు చెయ్యి పుచ్చుకుంటూ.

వెంకట్రావు ఆయనవెంట లేవటం తప్పనిసరి అయింది. ఇద్దరూ పార్కు బయటికి నడిచేరు. గవర్నరుపేటవైపు నడకసాగిస్తున్నారు మౌనంగా.

చిన్న పెంకుటింటియింగు నుంచునివున్న ఓఅమ్మాయి వెంకట్రావుదృష్టిని ఆకర్షించింది. తనని చూసి ఆమె లోపలకి వెళ్ళిపోయింది. తను ఆలోచనలో నాలుగడుగులు వేసేడు. యింతలో ముసలాయన కేక వేసేడు 'యిదే మన యిల్లు' అంటూ .... ..

వెంకట్రావుని గదిలోని బల్లమీద కూచోబెట్టి ఆయన లోపలకి వెళ్లేడు. ఆయన పట్టు పంచ కట్టుకొని అయిదునిముషాల్లో తిరిగొచ్చి 'లేచ్చని' చెప్పేడు. వెంకట్రావు అట్లానే, పైజమా, చొక్కాతోనే కూచున్నాడు భోజనానికి. ఆయన సంధ్య వారుస్తున్నాడు. వెంకట్రావుప్రాణం అప్పుడే ఎగిరిపోయింది. అతనికి ఏమాత్రం మనస్కరించలేదు, ఆయనప్రక్కని కూర్చుని భోజనం చెయ్యటానికి! అప్పటికే పరిస్థితులు విషమించేయి.

ఎర్రటిఅమ్మాయి, పదిహేనేళ్లుంటాయి - వచ్చి వడ్డనచేసింది. వెంకట్రావు ఆమెవంక దొంగచూపులు చూసేడు. సౌందర్యవతే అనుకున్నాడు. మనస్సులో ఏవో, వెర్రివెర్రి కోర్కెలు మొలకెత్తిసాగేయి, ఆమెని మాడగనే. ఆ అమ్మాయి తలుపుప్రక్కన దాగి తనని పరిశీలనగా చూస్తోందని గ్రహించగానే అతన కోర్కెలు దృఢపడ్డాయి!

ముసలాయన అన్నాడు తాపీగా భోంచేస్తూ 'నాయనా! మీ ఆవిడ కాపరాని కొచ్చిందా?'

వెంకట్రావు సందిగ్ధావస్థలో పడ్డాడు! ఇప్పటివరకు తను చెప్పిన అబద్ధాలవల్ల తను తేరుకోలేదు. అభిమన్యుడిలా పద్మవ్యూహంలోనికి తను వెళ్లడం అయితే వెళ్లేడుకాని బయటమాత్రం పడటంలేదు. అందుచేత నిజమే చెబితే ఎందుకైనా మంచిదని "నాకింకా వివాహం కాలేదండి" అన్నాడు; ఆమెవంక ఓరగా చూస్తూ!

ముసలాయన ఏమాత్రం ఆశ్చర్యము కనబర్చలేదు - బహుశః ఆయన యింతకుముందే గ్రహించి వుండొచ్చు ఎట్లానో. తను ఆయనవంక చూసేడు. బ్రాహ్మలకి వుండవలసిన జంధ్యం లేదే ఆయనమెడలో! బ్రహ్మసమాజికుడేమో! అయితే, సంధ్యమాత్రం ఎందుకు?

ఇంతలో అతని ఆలోచన అరికట్టబడింది. ఎవరో ముసలామె కిటికీలోంచి తనవంక చూస్తోంది. అతను ఆమెని చూడనట్లు నటిస్తూ భోజనం చేస్తున్నాడు. ఇంతట్లో ఇంకో ఆమె చేరింది ఆమెప్రక్క . ...మరో క్షణంలో యిద్దరూ మాయమయ్యేరు. తన నెందుకు యిట్లా పరీక్షగా చూస్తారు, వీళ్లు?

ఇంతలో ముసలాయన అన్నాడు: 'అమ్మాయిని చూసేవా? బంగారపుబొమ్మ - ఇంకా వివాహం కాలేదు. హిందీఇంగ్లీషులు వచ్చును. కట్నం యిచ్చుకోలేను.'

'నేను నా చదువు పూర్తిఅవుతేనేగాని చేసుకోనండి' అన్నాడు వెంకట్రావు, యీ క్రొత్త ప్రమాదంలోంచి తప్పించుకుందామని.

భోజనాలు అయి చేరిద్దరూ. ఆఖరుసారి ఆమె ధైర్యంగా చూసిన చూపు అతనిమనస్సుని కలత చేస్తోంది. ఎంత బాగుంది ఆమె! కాని తను అబ్రాహ్మణుడే! ముసలాయన బట్టలు మార్చుకుంటున్నాడు వుంకోగదిలో...తను మాత్రం వరండాలో నిల్చున్నాడు ఆలోచిస్తూ!

'చక్కగా వున్నాడు! అమ్మాయి వంక ఎట్లా దొంగచూపులు చూసేడో చూసేవ్ -' అంది ఓకంఠం నొక్కుకుంటూ - వంటగదిలోంచి కావల్సు.

'అమ్మాయి మాత్రం అతన్నించి చూపు తే మరల్చుకోలేకుండా వుంది...మా తల్లి ఓయింటిదవుతే, ఆ ఒక్క మూగకూడా లేకుండా వుంటేనా - ఎంచక్కా వుండును, కర్మం!' అంది మరో కంఠం.

'ఇస్ వూరుకో! ఆ అబ్బాయి చేసుకునేటే వున్నాడు లేవే అంది మొదటి కంఠం. అంతే! తర్వాత ఏమీ వినపడలే.

ఎవరిని గురించి యీ మాటలు - తనని గురించేనా? మూగ ఎవరికి? ఆ అమ్మాయికా! నిజం. వెంకట్రావుకి తర్వాత ఆలోచించడాని క్కూడ అవకాశం లేదు. ఇంతలో ముసలాయన వచ్చేడు. తాంబూలం యిస్తూ 'వేసుకో నాయనా, యీ తమలపాకులు. కూచో - నుంచున్నావే? మనది కలసిన సంబంధం. చిన్నప్పుడు మీ నాన్న అనేవాడు...!' వెంకట్రావు అడ్డమొచ్చి 'నాకింక రైలుకి టైము లేదండి - వస్తా -' అన్నాడు.

'టైములేకేం! పదింటికి కదా బండి - చూడు నువ్వు కనక...' ఇంకా ఏదో చెప్పబోతున్నాడు వృద్ధుడు - కాని వెంకట్రావు మళ్లీ అడ్డమొచ్చి 'చూడండి! నా చదువు పూర్తి అయితేనే కాని నేను ఎవరినీ వివాహం చేసుకోను. పైగా నా స్నేహితులతో కూడ ఆలోచిస్తేనే కాని నేను ఎవరినీ వివాహం చేసుకోను. నేనిప్పుడు మీ కేమాటా చెప్పలేను' అన్నాడు. 'చదువుకీ, పెళ్లికీ ముడివేస్తా రెందుకోయి! దేనిదారి దానిదే. పెళ్లాం వచ్చి చదువుకో వద్దని చెప్పుతుందా? చూడు-ఇంకో ఇరవై రోజుల్లో చక్కని ముహూర్తాలున్నాయి. ఆలోచించుకో -' అన్నాడు ముసలాయన. వెంకట్రావు యీ గొడవనుంచి ఎట్లాగైనా వదిలించుకోవాలని అట్లాగేలెండి - మా వూరెళ్లి, ఆలోచించి ఏ సంగతీ వ్రాస్తాను-' అన్నాడు గడియారం వంక తలెత్తి చూస్తూ.

కిటికీలోంచి ఆ అమ్మాయి తనవంక జాలిగా చూస్తోంది. 'అరే! ఆ మూగతనం లేకుండా వుంటే ఎంత బాగుండును!' అనుకున్నాడు. ముసలాయన ఓ కవరు యిచ్చి దీనిమీద నీఅడ్రసు వ్రాయి నాయనా' అన్నాడు. వెంకట్రావు 'చచ్చాంరా - భగవాన్!' అనుకొని, ఏదో అడ్రస్ వ్రాసియిచ్చి 'మరొస్తానండి' అంటూ బయటపడ్డాడు. ఆయన బయటివరకూ వెంకట్రావుని సాగనంపుతూ 'ఆలోచించి, ఏ సంగతీ త్వరగా వ్రాయి నాయనా! కట్నం విషయంకూడా కావాలనుంటే చెప్పు నాయనా! మేం నీ వుత్తరంకోసం ఎదురుతెన్నులు చూస్తూంటాము - మరి పెళ్లిపనులు చేసుకోవాలి గదా!' అన్నాడు. వెంకట్రావు అటాగేఅంటూ రోడ్డుమీదకు వచ్చి, ఓ క్షణం ఆగి కంగారుపడిన జీవాన్ని కుదుటపరచుకొని, గబగబా స్టేషన్‌వైపు నడచేడు.

దారిలో కృష్ణమూర్తి కనపడి 'ఏమిరోయి! బెజవాడవైపు వచ్చేవ్! సంగతేమిటి?' అన్నాడు.

'సెలవులు కదా! వోసారి చూచిపోదాం! అని వచ్చేను. ఏదీ, అందరూ తలోదారి అయ్యేరు. నువ్వెక్కడనుంచి వస్తున్నావు?' అన్నాడు వెంకట్రావు నీరసంగా!

'గుంటూరునుంచి వస్తున్నా! ప్రొద్దున్న దీక్షితులు కనపడి లాక్కుపోయేడు! దా... భోంచేద్దు కాని మాయిల్లు తెలుసా నీకు?' అన్నాడు కృష్ణమూర్తి. 'ఏమో - నాకేం తెల్సు! భోజనం ఏమీ అక్కరలేదు. చాలు, యిప్పుడే అయింది—' అని నవ్వుతూ జరిగినదంతా చెప్పుతూ, కృష్ణమూర్తివెనకాలే నడిచేడు—!

'అదే మాయిల్లు...మానాన్న' అన్నాడు దూరంగా వున్న పెంకుటిల్లు చూపుతూ!

ఆ! ఆయిల్లే! తను దాకా ముసలాయనతో వెళ్లినయిల్లు.

—వెంకట్రావు కంపిస్తూ.. !యిప్పుడే వస్తా... నడు' అంటూనే పక్కసందులోంచి, స్టేషన్ వైపు గబగబా నడిచేడు—వెనకాల తనని కేక వేస్తున్న కృష్ణమూర్తినన్నా వినిపించుకోకుండానే—?